ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్ : 4.40 (ఆదివారం)
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
3
శనివారం 6 ఏప్రిల్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 24.8



గోప్యత గోవిందా

మూలాలు ఇక్కడే !

- తీగ లాగే కొద్దీ కదులుతున్న డొంక
- ఫోన్ ట్యాపింగ్ టీమ్‌తో అంటకాగిన జిల్లా పోలీసుల పాత్ర ఒక్కొటి వెలుగులోకి
- ఇప్పటికే కీలకమైన వ్యక్తులను విచారించిన దర్యాప్తు బృందం
- నల్లగొండలో వార్‌రూమ్ నిర్వహణపై లోతుగా సాగుతోన్న విచారణ

రాష్ట్రంలో ఏ సంచలనం జరిగినా మూలాలు నల్లగొండ జిల్లాలోనే ఉంటున్నా యి. ఒకప్పటి సిమి ఉగ్రవాదుల నుంచి మొదలు మొన్నటి కరోనా.. నిన్నటి ఫోన్ ట్యాపింగ్ వరకూ ఉమ్మడి జిల్లా పేరును సంచలనంగా మారుస్తున్నాయి. హైదరాబాద్‌కు దగ్గరలో ఉండడం, రాజకీయ ఉద్దండులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలవడం తదితర కారణాలు ఏవైనా నల్లగొండ జిల్లా ప్రస్తావన నిత్యం చర్చనీయాంశంగా మారుతూనే ఉంటుంది. ఫోన్‌ట్యాపింగ్‌కు పాల్పడిన ప్రభాకర్‌రావుతోపాటు తిరుపతన్న, భుజంగరావులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే తొలుత పనిచేశారు. ఇక్కడ ఏర్పడిన బంధంతోనే మళ్లీ ఒక్కటై ట్యాపింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. అయితే ఈ ట్యాపింగ్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన ఉప ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా నేతల సంభాషణలను రికార్డు చేసి, తమకు కావాల్సిన వారికి అందజేసేందుకు వార్‌రూమ్ లను కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ, భువనగిరి టౌన్)

జిల్లాలోనూ కొనసాగిన ట్యాపింగ్


రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసుల పాత్ర ఒక్కోటిగా వెలుగులోకి వస్తోంది. నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐని ఇప్పటికే విచారించగా, నల్లగొండలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నిర్ధారించిన భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తాజాగా ట్యాపింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్న ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. విచారణ కొనసాగుతున్న కొద్దీ ఇంకా ఎవరెవరు బయటకు వస్తారోననే ఉత్కంఠ పోలీస్ శాఖలోనే కాదు, జిల్లా అంతటా నెలకొంది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. అప్పటి నుంచి ఇక్కడ ఆయనకు ఉన్న పరిచయాలతో సదరు అధికారులను ట్యాపింగ్ టీమ్‌లో చేర్చుకున్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న సహా ఇటీవల విచారించిన మరో ఇన్‌స్పెక్టర్ సైతం ఇలా పరిచయమైన వారేనని పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రధానంగా మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా, సూర్యాపేట జిల్లాలో మేళ్లచెర్వులో మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ విస్తరణ సందర్భంగా, ఆ తర్వాత ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ విస్తృతంగా జరిగినట్లు సమాచారం. నల్లగొండ, మహబూబ్‌నగ ర్ జిల్లాలను ఒక యూనిట్‌గా ఏర్పాటు చేసుకొని నల్లగొండలోనే ట్యాపింగ్ సెంటర్ నిర్వహించారని, రెండు జిల్లాలకు సంబంధించి ప్రతిపక్ష నాయకులు, వారు సన్నిహితంగా ఉండేవారి ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మునుగోడు ఉపఎన్నిక సమయంలో ప్రతిపక్షాలకు చెందిన నాయకుల ప్రతి కదలికను ట్యాపింగ్ ద్వారా గుర్తించి, అప్పటి అధికార పార్టీని అప్రమత్తం చేశారనే ఆరోపణలు ట్యాపింగ్ నేపథ్యంలో కీలకనేతలు చేస్తుండడం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతల్లో ఉన్న నేతలు ఈ ఆరోపణలు చేయడంతో ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ సీరియస్‌గా మారుతోంది. జిల్లాలో నెలకొల్పిన వార్‌రూమ్‌లో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని గుర్తించారని, వారందరి నుంచి వివరాలు సేకరించే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం ఎవరిపాత్ర ఏమిటనేది నిర్ధారిస్తారని తెలుస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ట్యాపింగ్ బృందంతో కలిసి ఎవరెవరు పనిచేశారు..? ట్యాపింగ్‌లో వీరు చేసిందేమిటనే అంశాలపై ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న నిందితులు చెబుతున్న ప్రకారం ఒక్కొక్కరిని విచారణకు పిలుస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా ట్యాపింగ్ వ్యవహారంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఒక్కో అంశం బయటకు వస్తుండడంతో ఇంకా ఏమేం వెలుగులోకి రానున్నాయనే అంశంపై పోలీసుశాఖలో, రాజకీయవర్గాల్లో ఆసక్తి కొనసాగుతోంది.

జోరుగా కొనసాగుతున్న చర్చ

ఫోన్ ట్యాపింగ్ నిందితుల్లో నలుగురు పోలీస్ అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేసిన వారే. ఆ నలుగురిలో ముగ్గురు నేడు కటకటాల పాలుకాగా, మరొకరు విదేశాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఆ నలుగురు ఫోన్ ట్యాపింగ్‌లో ప్రధాన నిందితులుగా ఉండడంతో ఉమ్మడి జిల్లాలో వారు పని చేసిన ప్రాంతాల్లోని ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. అలాగే వారి గత ఉద్యోగ నిర్వహణ తీరు, అప్పటి కేసులపై కూడా పలు రకాలుగా విశ్లేషించుకుంటున్నారు. వారితో అప్పట్లో సన్నిహితంగా మెదిలిన పలువురు ఉలిక్కిపడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో సెంట్రల్ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కేంద్రంగా జరిగి న ఫోన్ ట్యాపింగ్ లో ఉమ్మడి జిల్లా ఎస్పీగా పనిచేసిన టి.ప్రభాకర్‌రావు ప్రధాన నిందితుడిగా ప్రచారం అవుతుండగా, మరో ఇద్దరు అదనపు ఎస్పీ అధికారులు తిరుపతన్న, భుజంగరావు, డీఎస్పీ ప్రణీత్‌రావు ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పనిచేశారు. అయితే వీరందరూ పలు సందర్భాల్లో తీవ్ర ఆరోపణలను మూటగట్టుకొని పోలీస్ విచారణను ఎదుర్కొన్న నేపథ్యం ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి.

అర్ధాంతర బదిలీ, నయీం ముఠా ఆగడాలకు సహకరించినట్లు ఆరోపణలు

ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో నలుగురు పోలీస్ అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పలుహోదాల్లో పని చేశారు. వారిలో ఇద్దరి మొదటి పోస్టింగ్స్ యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ఉండడం గమనార్హం. ఫోన్ ట్యాపింగ్ ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఉమ్మడి జిల్లా ఎస్పీగా పని చేశారు. 2015లో సూర్యాపేటలో జరిగిన కాల్పుల ఘటనల్లో ఒక కానిస్టేబుల్, హోంగార్డు మృతి చెందడం, సీఐ మొగులయ్య గాయపడడాన్ని తీవ్రంగా పరిగణించి న అప్పటి ప్రభుత్వం ఎస్పీ టి.ప్రభాకర్‌రావును అర్ధాంతరంగా సీఐడీ ఎస్పీగా బదిలీ చేసింది. అప్పట్లోనే అతను పలు ఆరోపణలు కూడా ఎదుర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో కటకటాల వెనుక ఉన్న అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు కూడా ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరిన తిరుపతన్న 1992లో



భువనగిరి పట్టణంలో ప్రొబెషనరీ ఎస్ఐగా పని చేసిన అనంతరం 1993లో మొదటి పోస్టింగ్ యాదగిరిగుట్ట ఎస్ఐగా పనిచేశారు. అనంతరం భువనగిరి, మిర్యాలగూడ, తుంగతుర్తి, సూర్యాపేట, నల్లగొండ, చౌటుప్పల్, కోదాడ పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐ, సీఐగా పనిచేశారు. అనంతరం ఇతర జిల్లాలకు పదోన్నతి బదిలీపై వెళ్లి ఫోన్ ట్యాపింగ్ ఉదంతం వెలుగు చేసే వరకు అదనపు ఎస్పీగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు పలు ప్రాంతాల్లో నయీం ముఠా సాగించిన అరాచకాలకు తనవంతు సహకారం అందించేవాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నయీం ఎన్‌కౌంటర్ అనంతరం అతనిని పోలీస్ అధికారులు ప్రశ్నించి విచారణ కూడా జరిపారు. అలాగే ఇటీవలి వరకు జిల్లా అదనపు ఎస్పీగా పనిచేస్తూ ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలులో ఉన్న భుజంగరావు 2019 నుంచి 2021 వరకు భువనగిరి ఏసీపీగా పని చేశారు. అదే సమయంలో బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ పరిధిలోని హాజీపూర్‌లో జరిగిన ముగ్గురు బాలికల హత్య కేసును చేధించినందుకు ఉత్తమ పోలీస్ అవార్డు కూడా అందుకున్నారు. అయితే అప్పటి ప్రభుత్వంలో, పోలీస్ శాఖలో తనకున్న పలుకుబడితో పలు సివిల్ తగాదాల్లో తలదూర్చి పెద్ద మొత్తంలో వెనకేసుకున్నట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ ఉదంతానికి ప్రధాన కారకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రణీత్‌రావు ఉద్యోగ ప్రస్థానం కూడా యాదాద్రి భువనగిరి జిల్లాలోనే ప్రారంభమైంది. అతడి మొట్టమొదటి పోస్టింగ్ 2007లో వలిగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేశారు. అనంతరం సంస్థాన్‌నారాయణపురం, 2014 నుంచి 16 వరకు బీబీనగర్ ఎస్ఐగా కూడా పని చేసి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు.



వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్

రాజకీయ నాయకులు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ చేసినట్లు వస్తున్న అరోపణలు ఉమ్మడి జిల్లాలోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అప్పటి విపక్షం.. నేటి అధికార పక్షమైన కాంగ్రెస్‌కు చెందిన కీలక నాయకులు ఉమ్మడి జిల్లా నుంచి ఉన్న నేపథ్యంలో వారి ఫోన్లన్నీ ట్యాపింగ్ అయినట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తూ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. మునుగోడు ఉపఎన్నికలో అప్పటి బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓటమికి ఫోన్ ట్యాపింగే ప్రధాన కారణమని అప్పటినుంచి ఇప్పటి వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి చేస్తున్న అరోపణలు మరోమారు తెరపైకి వచ్చాయి. ఈ మేరకు అప్పటి ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర విచారణ జరపాలని కిషన్‌రెడ్డి తాజాగా డిమాండ్ కూడా చేశారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో ఓ పరిశ్రమ ఏర్పాటుపై జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ ఆధారంగానే ప్రజాభిప్రాయ సేకరణకు ముందే పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకించిన పలువురిని అరెస్ట్ చేయడం, ఫోన్ ట్యాపింగ్ ఉదంతంలో కటకటాల వెనుక ఉన్న తిరుపతన్న గతంలో ఆ ప్రాంతంలో సీఐగా విధులు నిర్వహించిన పరిచయాలతో ఇటీవలి ప్రజాభిప్రాయ సేకరణకు ముందుగా అక్కడే మకాం వేసి ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ రియల్ ఎస్టేట్ భూమ్‌లో కీలకమైన యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ భూముల క్రయ విక్రయాలపై కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అలైన్‌మెంట్ లోపం గత పాలకుల నిర్లక్ష్యమే

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, భువనగిరి రూరల్, ఏప్రిల్ 5: గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ సాంకేతికంగా మార్చలేనంత అడ్వాన్స్ పొజిషన్‌లోకి వెళ్లిందని, అయినప్పటికీ అలైన్‌మెంట్ మార్చి రాయిగిరి బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ పనుల్లో కదలిక వచ్చిన నేపథ్యంలో 45రోజుల క్రితమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అలైన్‌మెంట్ మార్పే అవకాశాలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు. అలాగే అలైన్‌మెంట్ మార్పు కోసం ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ కూడా నెల రోజుల క్రితం సీఎంకు ఫోన్‌చేసి మాట్లాడారని వివరించారు. పదేళ్ల అధికారంలో ఉండి కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరిట రూ.లక్ష కోట్లు దుర్వినియోగం చేసిన బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సాగునీరు అందించే బునాదిగాని, పిలాయిపల్లి, బొల్లేపల్లి తదితర మూసీ కాల్వలకోసం రూ.285 కోట్లు కేటాయించలేకపోయిందని విమర్శించారు. శనివారం తుక్కుగూడలో జరగనున్న జనజాతర బహిరంగ సభ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు నాంది కాబోతుందన్నారు. భువనగిరినుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. అంతకుముందు భువనగిరి శివారులోని రాయిగిరిలో మల్లిఖార్జునస్వామి ఆలయంలో జరిగిన మల్లన్న భ్రమరాంభిక కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ నరాల నిర్మల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేశ్, సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, శెట్టి బాలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని పిలాయిపల్లి నుంచి జూలూరు వరకు వయా పెద్దగూడెం రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నాయకులు ఆయనకు వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, నాయకులు పక్కీరు మల్లారెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, గట్టు రాంరెడ్డి పాల్గొన్నారు.

విడతల వారీగా స్నానాలు

● నీటి కొరతతో కస్తూర్బాగాంధీ విద్యార్థినుల ఇక్కట్లు ● 20 రోజులుగా సమస్య ● దాత సహకారంతో తీరుతున్న తాగునీటి సమస్య





కస్తూర్బాగాంధీ పాఠశాలకు ట్యాంకర్ ద్వారా నీటిని తాగునీటిని అందిస్తున్న దాత రమేశ్, నిరుపయోగం మారిన వాటర్ ట్యాంక్

తుర్కపల్లి, ఏప్రిల్ 5: తుర్కపల్లి మండలంలోని రామాపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యార్థులు నీటిఎద్దడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం కొందరు, మధ్యాహ్నం కొందరు విడతల వారీగా స్నానాలు చేస్తున్నారు. 20రోజులుగా నీటి సమస్య బాలికలను, ఉపాధ్యాయులు, సిబ్బందిని పీడిస్తోంది. పాఠశాలలో ప్రస్తుతం 150మంది బాలికలు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కలుపుకుని 22మంది ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులకు నీరందించడానికి రెండు బోరు బావులు ఉండగా భూగర్భజలాలు అడుగంటడంతో సరిపోను నీరందించడం లేదు. దీనికితోడు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా రెండు మూడురోజులకొకసారి నీరు వస్తున్నా అవి కూడా సరిపోవడం లేదు. మరుగుదొడ్డికి వెళ్లాలన్నా, స్నానం చేయాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలోని బోర్లలో ఒక బోరు నుంచి వచ్చే నీటిని వంట చేయడానికి ఉపయోగిస్తుండగా, మరో బోరు నుంచి వచ్చే నీటితో విద్యార్థులు స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ బోరు బావి నుంచి అరకొరగా నీరు రావడంతో కొంత మంది విద్యార్థులు ఉదయం స్నానాలు చేస్తుండగా, మరికొందరు విద్యార్థులు మధ్యాహ్నం చేస్తున్నారు. బోరు నిరంతరాయంగా పనిచేయకపోవడంతో ప్రతీ గంట, రెండు గంటలకు ఒకసారి బోరు ఆన్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటు మిషన్ భగీరథ నీరు, బోరు మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో పాఠశాలలోని వాటర్‌ప్లాంట్ వాడటం లేదు. అంతేకాకుండా పాఠశాలలో ఉన్న చెట్లకు నీరు పట్టక పోవడంతో ఎండవేడిమికి చెట్లు వాడిపోతున్నాయి. రెండు మూడు రోజులకోసారి వచ్చే మిషన్ భగీరథ నీటితో దుస్తులు శుభ్రం చేసుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. రెండు, మూడు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయని అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థిని సూచన.. తండ్రి ఔదార్యం

ఓ విద్యార్థిని సూచన, తండ్రి ఔదార్యంతో పాఠశాలలో తాగునీరు ఇబ్బంది తీరుతోంది. పాఠశాలకు సమీపంలోని మర్రికుంటతండాకు చెందిన బాలిక అంజలి పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. అంజలిని చూసేందుకు ఆమె తండ్రి రవి పాఠశాలకు వచ్చాడు. తాగునీటికి పడుతున్న ఇబ్బందిని అంజలి తండ్రి దృష్టికి తీసుకెళ్లింది. ఇదే విషయాన్ని ఏవో కూడా రవి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన గ్రామానికి వెళ్లిన తర్వాత తన స్నేహితుడు ధనావత్ రమేష్‌నాయక్ దృష్టికి విద్యార్థినుల ఇబ్బందిని తీసుకెళ్లాడు. దీంతో రూ.500 చొప్పున ఇద్దరూ వేసుకుని పాఠశాలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు.

మిషన్ భగీరథ నీరు సరిపోవడం లేదు

భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లలో చాలీచాలని నీరు వస్తోంది. మిషన్ భగీరథ నీరు వస్తున్నా సరిపోవడం లేదు. దీంతో నీటిసమస్య నెలకొంది. పాఠశాలలో నెలకొన్న నీటి సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లా. పాఠశాలలో నీటి సమస్యను పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సహకరించాలి.

● అనిత, స్పెషల్ ఆఫీసర్

ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నా

పాఠశాలలో కొన్ని రోజులుగా విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయుల ద్వారా తెలిసింది. ఉపాధ్యాయుల కోరిక మేరకు రెండు రోజులకొకసారి తమ గ్రామం నుంచి సుమారు 1000 లీటర్ల సామర్థమున్న నీటి ట్యాంక్‌లో నీటిని నింపుకొని ఆటోలో తెచ్చి ఉచితంగా పోస్తున్నా.

ధనావత్ రమేశ్‌నాయక్, వాటర్‌ప్లాంట్ యజమాని

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేట్‌పరం తగదు

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 5: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని, ఇది తగదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్ ఆరోపించారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, దేశంలో మత సామరస్యాన్ని కాపాడేందుకు బీజేపీని ఓడించి సీపీఎంను గెలిపించాలన్నారు. మతతత్వ భావోద్వేగాలతో పాలన సాగిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భువనగిరి నియోజకవర్గ సమస్యలపై పోరాడే చిత్తశుద్ధి ఉన్న సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. అన్ని వర్గాలకోసం పోరాటం చేస్తున్నది సీపీఎం మాత్రమేనన్నారు. ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ ఇప్పటివరకు గెలిచిన ఎంపీలందరూ స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ ప్రజా ప్రయోజనాలను విస్మరించారన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భట్టుపల్లి అనురాధ, జె వెంకటేష్, పగిళ్ల ఆశయ్య, కొండమడుగు నర్సింహ, నారి అయిలయ్య, జగదీష్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ పాల్గొన్నారు.

కొండగడపలో ఆర్టీసీ బస్సులు ఆపాలి

● పార్టీలకతీతంగా గ్రామస్థుల ధర్నా ● ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం



కొండగడపలో ధర్నాలో పాల్గొన్న గ్రామస్థులు

మోత్కూరు, ఏప్రిల్ 5: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఆపాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీలకతీతంగా గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. బస్సులు ఆపకపోవడంపై బస్టాప్ వద్ద టెంట్‌వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు కొప్పుల శ్రీధర్‌రెడ్డి, లెంకల వేణు మాట్లాడుతూ తమ గ్రామంలో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏవీ ఆపడం లేదన్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోత్కూరుగాని, పాటిమట్ల క్రాస్‌రోడ్డు వద్దకు గాని వెళ్లి బస్సెక్కాల్సి వస్తుందన్నారు. రాత్రివేళ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థినులు అంత దూరం నుంచి చీకట్లో ఒంటరిగా ఎలా నడిచి వస్తారని ప్రశ్నించారు. ఐదారు గంటలు నిరసన వ్యక్తం చేసిన అనంతరం మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి మునిసిపల్ చైర్‌పర్సన్‌తో లేఖ రాయించుకుని, దానికి గ్రామస్తుల వినతి పత్రం జతచేసి తొర్రూరు వెళ్లి డిపో మేనేజర్ పద్మావతికి అందజేశారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని తాను డ్రైవర్లకు చెబుతానని ఆమె హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కన్నెబోయిన లింగం, అంబటి వెంకటయ్య, నోముల రమేష్, నర్సింహాచారి, చిలుక రాములు, భారతమ్మ, ఉపేంద్ర, అంజమ్మ, లక్ష్మీ, నర్సమ్మ పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 5: రైతులకిచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకూ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటాడుతామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరిలో నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసాను వెంటనే నెరవేర్చి రైతుబంధును ఖాతాల్లో జమ చేయాలన్నారు. రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతులకు రూ.15వేలు, ధాన్యానికి రూ.500 బోనస్ వెంటనే అమలు చేయాలన్నారు. పంటలు ఎండి పోవడానికి, కరువుఛాయలు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, పడాల శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్‌రెడ్డి, మోర్చ జిల్లా అధ్యక్షుడు ఫక్కీర్ రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యన్నం శివకుమార్, అశోక్‌గౌడ్, కపిల్, మాధవి పాల్గొన్నారు.

సంస్కృతి, సంస్కారానికి ప్రతీక రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు


రామరాజ్ కాటన్ వస్త్రాల షోరూంను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 5 : దేశ సంస్కృతికి, సంస్కారానికి రామరాజ్ కాటన్ వస్త్రాలు అద్దం పడతాయని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా ఆధునిక హంగులతో అత్యధిక డిజైన్లతో ఏర్పాటుచేసిన రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల షోరూంను శుక్రవారం ఆయన మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి రామరాజ్ కాటన్ వస్త్రాలను కొనుగోలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రామరాజ్ కాటన్ వస్త్రాలు నాణ్యతకు మారుపేరని, పేరెన్నికగన్న రామరాజు కాటన్ వస్త్రాలు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. వివాహాది శుభకార్యాలకు నల్లగొండ పట్టణ ప్రజలు హైదరాబాద్ వంటి పెద్దపెద్ద నగరాలకు వెళ్లకుండా నల్లగొండలోనే కొనుగోలు చేసేలా షోరూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల షోరూంను జిల్లా ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లతో పాటు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డిని షోరూం నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షోరూమ్ ఇన్‌చార్జి రాకేష్, ఏరియా మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరికొండపై వైభవంగా ఏకాదశి పూజలు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 5: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామివారి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు లక్షపుష్పార్చన పూజలు జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను పంచామృతాలు, తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయం ముఖమండపంలో కవచమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు పొదిగిన బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సింహాసనంపై అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలను పఠిస్తూ వివిధ పుష్పమాలికలతో లక్షపుష్పార్చన చేపట్టారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో కొలువుదీరిన శ్రీపర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యార్చనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 24,63,333ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.


ప్రధానాలయంలో లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నందికొండలో ఒకటోవార్డుకు
నీటి సరఫరా పునరుద్ధరణ

● కోతులు చనిపోయిన నీటి ట్యాంకు మూసివేత

నాగార్జునసాగర్, ఏప్రిల్ 5 : నల్లగొండ జిల్లా నందికొండ మునిసిపాలిటీలో ఒకటవ వార్డుకు శుక్రవారం నూతన పైప్‌లైన్ నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు. 10 రోజుల కిందట దాహార్తి తీర్చుకోవడానికి వెళ్లి మినీట్యాంకులో పడి 30కోతులు మృతి చెందగా, రాజకీయ దుమారం నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మినీట్యాంక్‌ను మూసివేయడంతో పాటు ట్యాంక్ పరిధిలోని కాలనీలోని ఇళ్లకు నేరుగా పైప్‌లైన్ ద్వారా తాగు నీటి సరఫరాను చేస్తున్నట్లు ఈఈ మల్లిఖార్జున్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్‌తో నీటిసరఫరాపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


ఇళ్లకు నేరుగా నీటిసరఫరా చేసేందుకు పైప్‌లైన్ వేస్తున్న ఎన్ఎస్‌పీ సిబ్బంది

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


హలీం మృతదేహం

కోదాడ రూరల్, ఏప్రిల్ 5 : విద్యుదాఘాతంతో సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రెడ్లకుంట గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ హాలీం(24) సుతారీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. పనిలో భాగంగా శుక్రవారం ఉదయం నల్లబండగూడెం గ్రామశివారులోని రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద గల షేక్ రహీం కొత్త ఇంటి మీద పనిచేస్తున్నాడు. 11.30 గంటల సమయంలో తన చేతిలో ఉన్న అల్యూనియం ఫాస్టింగ్ బద్దె పైకి లేపాడు. దీంతో ఇంటిపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హలీం తండ్రి అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా రాయినిగూడెం సమీపంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ బాలునాయక్ తెలిపిన వివరాల ప్రకారం మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలోని సెవెన్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతడు మతిస్థిమితం లేని వ్యక్తిగా భావిస్తున్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 ఏళ్లు ఉండొచ్చని, ఎత్తు 5.8 అడుగులు, కోల ముఖం, మృతుడి కాళ్లకు గీత కార్మికుడి మాదిరిగా తాటిచెట్టు ఎక్కిన వ్యక్తిగా కనబడుతున్నట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి 8712686006, ఎస్ఐ బాలునాయక్ 8712686030 నెంబరుకు సమాచారం తెలపాలన్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రురాలు..

కేతేపల్లి, ఏప్రిల్ 4 : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. ఎస్ఐ శివతేజ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళ్ళపురం గ్రామానికి చెందిన ఆమనగంటి అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. జీవనోపాధి కోసం అశోక్ ట్రాలీ ఆటోను జీహెచ్ఎంసీలో చెత్త సేకరణకు పెట్టాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం స్వగ్రామం ఇస్తాళ్ళపురంలో నిర్వహించే పండగ కోసం కుటుంబ సభ్యులతో కలిసి ట్రాలీ ఆటోలో బయలుదేరాడు. కార్యక్రమం పూర్తికావడంతో బుధవారం సాయంత్రం ఆటోలో హైదరాబాద్‌కు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో ఆటో ఇనుపాముల బస్‌స్టేజీ సమీపంలో అదుపు తప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న ఆమనగంటి మల్లయ్యతో పాటు అశోక్ తల్లి ఎల్లమ్మ, నాయిని అనంతమ్మ, నాయిని భారతమ్మ, నాయిని ఎల్లయ్య, ఆమనగంటి పూలమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమనగంటి ఎల్లమ్మ(44)మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివతేజ తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే కరువు పెరిగింది


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరువు తీవ్రత పెరిగిందని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు ఎకరాకు రూ.25 నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయాయని అన్నారు. సాగునీటి కొరతతో పంట నష్టపోయి పెట్టుబడి కూడా చేతికందక అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్, సూర్యాపేట జనగాం జిల్లాల్లో ఎండి పంటలను పరిశీలించేందుకు మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట పట్టగానే ప్రభుత్వం మేల్కొందన్నారు. ఎందుకూ పనికిరాదని రాద్ధాంతం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి ఎస్సారెస్పీ ద్వారా సీఎం, మంత్రులు నీటిని విడుదల చేశారన్నారు. ప్రాజెక్టులో నీరు నిల్వలేదని చెప్పిన సీఎం, మంత్రులు ఈ రోజు ఎక్కడి నుంచి నీటిని తెచ్చి వదిలారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీసీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి పంట నీరు లేక ఎండిపోయిందన్నారు. సాగునీటిని వదిలి పంటలను రక్షించాలని ప్రతిపక్షాలు గగ్గోలుపెట్టినా ప్రభుత్వం పట్టించుకోలేదని, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులు నిండా మునిగారని ఆరోపించారు. మార్చి నెలలో 12 రోజుల పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పొలాలకు నీళ్లు వదలకుండా పోలీసులను, అధికారులను కాపలాపెట్టి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లారని అన్నారు. జిల్లా మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డిల చేతకానితనం వల్లే ఉమ్మడి జిల్లాకు నీరివ్వకుండా ఖమ్మం జిల్లాకు తీసుకెళ్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు, ప్రజలు అల్లాడుతున్నా జిల్లా మంత్రులకు సోయిలేకుండా నిద్రపోతున్నారని విమర్శించారు. ఎడమకాల్వ పరిధిలో 41 ఎత్తిపోతల పథకాలకు నీటిని వదిలి చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సీఎం, మంత్రులు ఎక్కడి నుంచి వసూలు చేయాలి, ఎప్పుడు ఢిల్లీకి పంపాలన్న తపనతో పని చేస్తున్నారని అన్నారు. 110 రోజుల పరిపాలనను గాలికి వదిలేశారని, ప్రభుత్వ వైఫల్యాలను గత ప్రభుత్వంపై ఆపాదించి పబ్బం గడుపుతున్నారని అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజవర్గ కేంద్రాల్లో చేపట్టే ధర్నాలు, దీక్షలకు పార్టీ శ్రేణులు, అభిమానులు, రైతులు మద్దతుగా నిలిచి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు యాదగిరిరెడ్డి, రవినాయక్, సైదులుయాదవ్, హాతీరాంనాయక్, నర్సింహారెడ్డి, బిక్షంగౌడ్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.


నేరేడుగొమ్ములో ఎన్నికల సన్నాహక సమావేశంలో స్థానిక గిరిజనులతో జానారెడ్డి

అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

చందంపేట, ఏప్రిల్ 5: దేవరకొండ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలకేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను సుదీర్ఘకాలం నల్లగొండ జిల్లాకు మంత్రిగా పనిచేయడంతో ఈ ప్రాంత సమస్యపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని, రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో దేవరకొండ నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలన్నారు.అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ మండలంలోని అంబా భవానీ ప్రాజెక్టు, నక్కలగండి ఎత్తిపోతల పథకాన్ని ఐదేళ్లలో పూర్తిచేసి మండలాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలునాయక్ సహ కారంతో సీనియర్ నాయకులు జానారెడ్డి సూచనలతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని, ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముక్కమళ్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని కృష్ణయ్య, జడ్పీటీసీ బాలునాయక్, నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

మిర్యాలగూడ అర్బన్ : మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీతారాంపురం చిన్నమసీద్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే బీఎల్ఆర్, జైవీర్‌రెడ్డి, నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘు వీర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, సంజీవరెడ్డి, రామలింగయ్యయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సలీం, ఆరీఫ్, జానీ, చాంద్‌పాషా, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ఓటేస్తే నిష్ప్రయోజనం


ప్రచారంలో భాగంగా కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

చిట్యాల, ఏప్రిల్ 5 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. గల్లీలో, ఢిల్లీలో లేని బీఆర్ఎస్‌కు ఓటేస్తే ఏలాభం ఉండదని, అలాగే కల్లబొల్లి హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఢిల్లీలో ఎలాగూ గెలవదని, ఆ పార్టీకి ఓటేయవద్దని కోరారు. హామీలను అమలుచేయలేక కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం పేరుతో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోందన్నారు. గతంలో తాను ఎంపీగా భువనగిరి రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. మోదీ సార్థ్యంలో దేశం సురక్షితంగా ఉండడమే కాక సుస్థిర అభివృద్ధి సాధిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక మహిళలతో ముచ్చటించారు. కార్యక్రమంలో మైల నర్సింహ, కంబాలపల్లి సతీష్, కూరెళ్ల శ్రీను, పొట్లపల్లి నర్సింహ, గంజి గోవర్ధన్, కన్నెబోయిన మహలింగం, జయారపు రామకృష్ణ, మాస శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఐలాపురం చెరువులో గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సాగర్ నీటితో చెరువులు, కుంటలను నింపాలి

మిర్యాలగూడ రూరల్, ఏప్రిల్ 5: నాగార్జునసాగర్ ఎడమకాల్వ నీటితో చెరువులు, కుంటలను నింపి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామ చెరువులో గిరిజన మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోయాయని, ఫలితంగా సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడిందన్నారు. ముఖ్యంగా వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఐలాపురం గ్రామస్థులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సాగర్ మెయిన్ కెనాల్ ద్వారా తాగునీటిని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం సాగర్ ఎడమకాల్వ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి కోసం నీటిని తీసుకెళ్తున్నారని, అదేవిధంగా నల్లగొండ జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాగర్ ప్రధానకాల్వ ద్వారా చుట్టుపక్కల ఉన్న చెరువులను, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. తద్వారా భూగర్భజలాలు పెరిగి తాగునీటి ఎద్దడిని నివారించవచ్చని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సాగర్ నీటితో చెరువులను, కుంటలను నింపి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, రాంమ్మూర్తి, నాగేశ్వర్‌నాయక్, శ్రీనునాయక్, వెంకటేశ్వర్లు, జగన్‌నాయక్, బాణావత్ నాగమ్మ, సునీత, లక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 5: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు ఎక్సైజ్ సీఐ దీపిక శుక్రవారం తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుజిత్‌సాహు ఆలేరు మండలంలోని రఘునాథ్‌పూర్ గ్రామశివారులో ఏడాదిగా నివాసం ఉంటున్నాడు. ఆలేరులో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సుజిత్‌సాహును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద 118 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2500 ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్లు రాధాకిషన్, నిరోశ, విజయ్, సిబ్బంది ఉన్నారు.

చింతలపాలెంలో..

మేళ్లచెర్వు: గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ధర్మాపురంతండాకు చెందిన మహిళ కూలీ పని చేసుకుంటూ, స్నేహితుల ద్వారా గంజాయికి అలవాటుపడింది. కొంతకాలంగా గంజాయి సప్లయ్ చేసే వారి నుంచి అధిక మొత్తంలో కొనుగోలు చేసి, చిన్నచిన్న ప్యాకెట్ల ద్వారా జగ్గయ్యపేట నుంచి ప్యాసింజర్ ఆటోల్లో మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల్లోని పరిశ్రమల్లో పనిచేసే కూలీలకు విక్రయిస్తుంది. అలా గంజాయిని విక్రయించడానికి వెళ్తుండగా గురువారం చింతలపాలెం బస్టాండ్ వద్ద మహిళను పట్టుబడి చేసి 200 గ్రాములు గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా కారు దగ్ధమైన సంఘటన శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో చోటుచేసుకుంది. ఎస్ఐ జీ వెంకటశ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా కేంద్రంలోని గోపాల్‌పూర్‌కు చెందిన చొల్లేటి సుధాకర్‌రెడ్డి తన స్నేహితుడికి చెందిన కుమారస్వామి కారును తీసుకొని భార్య రేవతి, సవితతో కలిసి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆలేరులోని కందిగడతండా వద్దకు వస్తున్న క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డుపైపు వెళ్లి పల్టీలు కొట్టుకుంటూ వెళ్లి గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్ వేణుతో పాటు సుధాకర్‌రెడ్డి, రేవతిలకు తీవ్రగాయాలయ్యాయి. ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై కారు యజమాని కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కేసు నమో దు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో కారు దగ్ధమైంది.

మృతుడి ఆచూకీ లభ్యం

తిప్పర్తి, ఏప్రిల్ 5 : గుర్తు తెలియని మృతదేహంగా గురువారం వెలుగులోకి వచ్చిన మృతుడి ఆచూకీ తెలిసినట్లు శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి ఎస్ఐ డీ రాజు తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట పరిధిలోని పాటిగడ్డకు చెందిన జోగిని యాదగిరి(38) రెండేళ్లుగా ఫిట్స్‌వ్యాధితో బాధపడుతూ మద్యానికి బానిసై ఇంటి వద్దే ఉంటున్నాడు. మార్చి 30వ తేదీన వారి బంధువుల శుభకార్యం నిమిత్తం తల్లి ఘట్కేసర్‌కు వెళ్లగా మద్యం సేవించిన మైకంలో ఇంటి నుంచి బైటికి వెళ్లిన యాదగిరి ఇంటికి వెళ్లలేదు. అయితే గురువారం తిప్పర్తి మండలం బండ్లవారిగూడెం సమీపంలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు తెలిపారు. వారు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేశారు. శుభ కార్యం నిమిత్తం ఊరు వెళ్లి వచ్చిన తల్లి కుమారుడు కనబడుటలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే క్రమంలో గురువారం మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డుతో సమాచార నిమిత్తం తిప్పర్తి పోలీసులు సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో శుక్రవారం వారి బంధువులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఫిట్స్‌తో కుమారుడు చనిపోయాడని తల్లి రాములమ్మ నిర్ధారించుకొని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సులు...



నార్కట్‌పల్లి : వరుస సెలవులు, శుభకార్యాలు ఉండటంతో నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ శుక్రవారం సాయంత్రం ప్రయాణికులతో రద్దీ నెలకొంది. హైద్రాబాద్ వైపు వెళ్లే బస్సులు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు సుమారు 2 గంటల పాటు ఎదురుచూశారు.

మతసామరస్యానికి ప్రతీక మదార్‌బాబా దర్గా



దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మార్చి 5: జిందాసా మదార్ బాబా దర్గా స్నేహ భావాన్ని పెంపొందిస్తూ మత సామరస్యాన్ని చాటుతోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని శర్బణాపురంలో గల జిందాసా మదార్ బాబా దర్గా గంధోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. దర్గాలో హిందూ ముస్లింల మధ్య సేవా భావాన్ని కలిగిస్తూ, ఒకే కుటుంబంలా ఉండేలా చేస్తున్నాయన్నారు. ప్రజలు భక్తి భావాన్ని అలవర్చుకుని సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంధమల్ల అశోక్ ఉన్నారు.

బునాదిగాని కాల్వకు మరమ్మతులు చేపట్టాలి

వలిగొండ, ఏప్రిల్ 5: బునాదిగాని కాల్వ మరమ్మతులకు నిధులు కేటాయించాలని మండలంలోని టేకుల సోమారం గ్రామ పరిసర ప్రాంత రైతులు శుక్రవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయకట్టు ప్రాంత పంట పొలాలు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, కాలువలపై రూ.500 కోట్లు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేగూరి మల్లేశం, రేఖల ప్రభాకర్, రేఖల బాలరాజు, యానాల అశోక్‌రెడ్డి, పడమటి సత్తిరెడ్డి, మద్ది యాదిరెడ్డి, చేగూరి యాదయ్య, జంగయ్య ఉన్నారు.

రంజాన్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి



తాజ్‌పూర్‌లో ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేస్తున్న రాకల శ్రీనివాస్

భువనగిరి రూరల్, ఏప్రిల్ 5: రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నేత రాకల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాజ్‌పూర్‌లో సొంత నిధులను వెచ్చించి ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి సామరస్యాలకు రంజాన్ ప్రతీక అన్నారు. కార్యక్రమంలో ముస్లింలు ఎస్‌కే యాకూబ్, జహంగీర్, హైమద్, కరీం, షరీఫ్ రెహమాన్, రషీద్, నాయకలు ఓరుగంటి రమేష్, అరుణ్‌కుమార్, కిరణ్, నగేష్, బాల్‌రాజ్, నరసింహ ఉన్నారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న రైల్వే ఉద్యోగులు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 5: రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని రైల్వే డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ కొత్త మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆలేరులో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని, ఆరోగ్యవంతుడైన ప్రతీ వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని కోరారు. బ్రాంచ్ ఛైర్మన్ తిరుపతి, యాదగిరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మోత్కూరు, ఏప్రిల్ 5: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మెయిన్ రోడ్డు విస్తరణలో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యకు రాగా వాటిని పక్కకు నాటారు. నూతనంగా నాటిన విద్యుత్ స్తంభాలపై విద్యుత్ లైన్ (తీగలు) లాగేందుకు ఈ నెల 6న (శనివారం) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఏఈ హస్సేన్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెంచిన పెన్షన్‌ను అమలు చేయాలి: వనం

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 5: దివ్యాంగులకు పెంచిన పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని పుట్టపాక గ్రామంలో శుక్రవారం దివ్యాంగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ పెంచి, 100 రోజుల లోపు అందజేస్తామని చెప్పినప్పటికీ, నేటికీ అమలు కావడం లేదని ఆయన అన్నారు. ప్రతీ దివ్యాంగుడికి అంత్యోదయ రేషన్ కార్డు అందజేసి, 35 కిలోల బియ్యం ఇవ్వాలన్నారు. ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. అనంతరం నూతన గ్రామ కమిటీ ఎన్నుకున్నారు కమిటీ గౌరవాధ్యక్షుడిగా పిట్ట శ్యాంసుందర్, అధ్యక్షుడిగా జోకు వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా కుక్కల వెంకటయ్య, కార్యదర్శిగా ఆడెపు గాంధీబాబు, సహాయక కార్యదర్శిగా జోకు శంకరయ్య, కోశాధికారిగా జోకు జ్యోతిబాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ట్యాంకుల్లో నీరు సురక్షితమేనా?

ఓవర్‌హెడ్ ట్యాంకుల్లోనుంచి ఇళ్లలోకి సరఫరా అయ్యే నీరు సురక్షితమేనా? వాటి నిర్వహణ సరిగానే ఉందా? అనే చర్చ మొదలైంది. ఇటీవల నల్లగొండ జిల్లా పరిధిలోని నాగార్జునసాగర్‌లోని ఓ కాలనీకి తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులో 30కోతులు మృత్యువాత పడడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ క్రమంలో స్థానికంగా ట్యాంకుల నిర్వహణ సరిగానే ఉందా? అందులోనుంచి ఇళ్లలోకి సరఫరా అయ్యే తాగునీరు సరక్షితమేనా? అనే ప్రశ్నలు చర్చనీయాంశమయ్యాయి. ఇదే విషయమై జిల్లా కేంద్రమైన భువనగిరి మునిసిపాలిటీని పరిశీలిద్దాం..

- భువనగిరి టౌన్

- నాగార్జునసాగర్ ఘటనతో ట్యాంకుల నిర్వహణపై చర్చ
- మినీ ట్యాంకుల నిర్వహణ అస్తవ్యస్తం అంటున్న స్థానికులు
- ప్రధాన ట్యాంకులు సురక్షితమే అంటున్న అధికారులు

భువనగిరి పట్టణం కేంద్రంగా తాగునీటి సరఫరా ట్యాంకులపై చర్చ జరుగుతోంది. సికింద్రాబాద్ సైనిక్‌పురి రిజర్వాయర్ నుంచి రోజువారీగా 5.7 ఎంఎల్‌డీ గోదావరి జలాలు, సుమారు 1 ఎంఎల్‌డి స్థానిక జలాల సరఫరా జరుగుతోంది. పైపులైన్‌లేని ప్రాంతాల్లో మూడు ట్యాంకర్ల ద్వారా రోజువారీగా తాగునీటిని మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. గోదావరి జలాలను మూడు రోజులకు ఒకసారి, స్థానిక జలాలను రోజు విడిచి రోజు వేర్వేరు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. కాగా భువనగిరి పట్టణ పరిధిలో ఆరు ప్రధాన ట్యాంకులు, 14 మినీ ట్యాంకులు ఉన్నాయి. క్రమం తప్పకుండా ట్యాంకులను శుభ్రం చేస్తున్నట్లు అధికారులతో పాటు సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే ప్రధాన ట్యాంకుల నిర్వహణ సక్రమంగానే ఉన్నప్పటికీ బస్తీల్లోని కొన్ని మినీ ట్యాంక్‌ల నిర్వాహణ అధ్వానంగా ఉన్నట్లు కంటికి కనిపిస్తోంది. అన్ని ట్యాంక్‌లకు మూతలు ఉన్నప్పటికీ వాటి పరిసరాల పరిశుభ్రతను మాత్రం మునిసిపల్ యంత్రాంగం విస్మరిస్తోందని స్థానికులు అంటున్నారు. సికింద్రాబాద్ నుంచి భువనగిరికి రక్షిత జలాలను సరఫరా చేసే సుమారు 50 కిలోమీటర్ల పైపులైన్‌కు తరచూ తలెత్తే లీకేజీలకు మరమ్మతులు చేస్తున్న సందర్భంలో అప్పుడప్పుడూ నల్లాల ద్వారా కలుషిత నీరు కూడా సరఫరా అవుతోందని సానికులు పేర్కొంటున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టిన వెంటనే సంబంధిత ట్యాంక్‌లను శుభ్రం చేస్తే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాదని పట్టణ వాసులు అంటున్నారు. అయితే భువనగిరిలో కోతుల సంచారం విరివిగా ఉన్న నేపథ్యంలో నాగార్జునసాగర్ ఘటన ఇక్కడా తలెత్తకుండా జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మునిసిపాలిటీదేనని పలువురు అంటున్నారు.



భువనగిరిలోని ప్రధాన నీటి ట్యాంక్, నిర్వహణలోపంతో భువనగిరి ఇందిరానగర్ మినీ ట్యాంక్

ట్యాంకుల నీరు సురక్షితమే..అపోహలు వద్దు



భువనగిరి మునిసిపల్ పరిధిలోని నీటి ట్యాంక్‌ల నిర్వహణ సక్రమంగానే ఉంది. అన్ని ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నాం. స్థానిక జలాలను క్లోరినేషన్ చేస్తున్నాం. అన్ని ట్యాంకులకు మూతలు ఉన్నాయి. ట్యాంకుల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాం. శిథిలావస్థకు చేరిన మినీ ట్యాంకులను తొలగించి నూతన ట్యాంకులను నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. ట్యాంకుల నిర్వహణపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దు. కలుషిత నీరు సరఫరా అయినా, ట్యాంక్‌ల నిర్వహణలో లోపాలు తలెత్తినా వెంటనే ప్రజలు మునిసిపల్ అధికారులకు లేదా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

-పి.రామాంజులరెడ్డి, మునిసిపల్ కమిషనర్, భువనగిరి

చౌటుప్పల్‌లో ఇలా..



చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో 24 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ల ద్వారా ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఒక్కోక్క వాటర్ ట్యాంక్ నిర్వహణ కోసం ఒక వార్డు ఆఫీసర్‌ను నియమించారు. వాటర్ ట్యాంక్‌ను రెండు, మూడు నెలలకు ఒకసారి శుభ్రం చేస్తున్నట్టు మునిసిపల్ అధికారులు తెలిపారు.

లక్ష్యాల సాధనకు ఆత్మవిశ్వాసంతో సాగాలి



యువతీయువకులకు మార్గదర్శనం చేస్తున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎంఏ.కరీం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 5: యువతీ, యువకులు వ్యక్తిగత జీవితంలో నిర్దిష్ట ప్రామాణిక లక్ష్యాన్ని ఏర్పరుచుకుని వృత్తిపరమైన ప్రావీణ్యతతో సాధించాలంటే ఎదురయ్యే అవాంతరాలను స్వీయ సాధన పద్ధతులు పాటించి, ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్టు డాక్టర్ ఎంఏ.కరీం అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్‌టీఆర్ఐ) లో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్కెటింగ్ ఆధారిత ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో నూతన సాంకేతిక పద్ధతులతో శిక్షణ పొందుతున్న యువతీ యువకులకు ఆయన మార్గదర్శనం చేశారు. లక్ష్య సాధనలో మనసు, మానసిక శక్తి అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మానసిక ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చారు. జీవితంలో ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులు, అవరోధాలను అధిగమించేందుకు 'ఆటో సజేషన్ టెక్నిక్-21' పద్ధతి ద్వారా అంతర్గత శక్తి సామర్థ్యాలను బలపర్చుకునే విధానాలపై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ మెజీషియన్ రామకృష్ణ ప్రదర్శించిన మ్యాజిక్ షో అందరినీ అలరించింది. ఎస్ఆర్‌టీఆర్ఐ డైరెక్టర్ టీఎస్ఎస్ఆర్ సాయిలక్ష్మి, ఫ్యాకల్టీ వసంతరాణి, లలితరాణి, శైలజ, శ్రీనివాస్, దీప్తి, రాంకిషోర్, ఎన్.శ్రీనివాస్‌రావు, వి.వెంకటేశ్వర్లు, స్వామి పాల్గొన్నారు.

చేనేత సంక్షేమం కోసం ప్రభుత్వాల కృషి

కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఫైనాన్షియల్, అడ్వయిజరీ హర్షిత్ గోపాల్



చేనేత డిజైన్లను పరిశీలిస్తున్న కేంద్ర అధికారి హర్షిత్‌గోపాల్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగంలోని కార్మికులు, పారిశ్రామికుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ అడ్వయిజరీ, టెక్స్‌టైల్ ఫైనాన్షియల్ ఐఏఎస్ అధికారి హర్షిత్‌గోపాల్ అన్నారు. శుక్రవారం ఆయన భూదాన్‌పోచంపల్లి పట్టణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత మగ్గాలను సందర్శించి కార్మికుల జీవన స్థితిగతులను, వారి కళాత్మక నైపుణ్యాన్ని పరిశీలించారు. చేనేత కార్మికుల, పారిశ్రామికుల మనుగడ కోసం ఏ విధమైన చర్యలు తీసుకుంటే అభివృద్ధి జరుగుతుందనే అంశంపై పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవాధ్యక్షులు కర్నాటి బాలరాజు, రాష్ట్ర చేనేత నాయకులు తడక రమేష్‌తో చర్చించారు. అనంతరం చేనేత కార్మికుల ఇళ్లను సందర్శించారు. కార్మికులు తయారు చేసే పట్టుచీరల డిజైన్లను, వస్త్ర తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత కళాకారులు రూపొందించిన అద్భుతమైన ఇక్కత్ డిజైన్లను చూసి ఆయన వారి కళాత్మక నైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవాధ్యక్షుడు కర్నాటి బాలరాజు, మాజీ అధ్యక్షుడు తడక రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు నాయకులు మెరుగు శశికళ పాల్గొన్నారు.

జనజాతర సభకు అధిక సంఖ్యలో తరలాలి



నాయలను ప్రశ్నిస్తున్న కార్యకర్తలు

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 5: తుక్కుగూడలో ఈనెల 6న నిర్వహించనున్న జనజాతర సభకు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జనజాతర సభను విజయవంతం చేసేందుకు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుల తీరుపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్ ప్రోటో కాల్ పాటించకుండా సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా అవమాన పరుస్తున్నారని కార్యకర్తలు మిట్ట రాంచందర్‌గౌడ్, గుండ్లపల్లి కరుణాకర్‌గౌడ్, పెలిమెల్లి చిన వెంకట్‌గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని, నాయకులు అందరినీ కలుపుకొని పోవాలని హితవు పలికారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ అందరం కలిసి జనజాతర సభకు అధిక సంఖ్యలో వెళ్లి విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సమావేశంలో మండల, పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజ్‌గౌడ్, బందారపు భిక్షపతిగౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, యుగేందర్‌రెడ్డి, సుడుగు జీవన్‌రెడ్డి, నరేష్, బిట్టు హరీష్, గడ్డ వరలక్ష్మి, గుండు జ్యోతి, శ్రీవల్లి పాల్గొన్నారు.

'భువనగిరి ఖిల్లాపై కష్టజీవుల జెండా ఎగురవేస్తాం'

మోటకొండూర్, ఏప్రిల్ 5: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఖిల్లాపై కష్టజీవుల జెండా ఎగురవేస్తామని సీపీఎం పార్లమెంట్ అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని దేశవ్యాప్తంగా ఓడించడమే సీపీఎం లక్ష్యమని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, రాజ్యాంగాన్ని మార్చడం అంటే దేశ ప్రజల భవిష్యత్తును మార్చడమేనని అన్నారు. గల్లీ సమస్యలు తెలియని వారు ఢిల్లీలో ఏం మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎదునూరి వెంకటేష్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ జగదీష్, మండల కార్యదర్శి బొలగాని జయరాములు, సీనియర్ నాయకులు రేగు సిద్దయ్య, మండల కమిటీ సభ్యుడు కొల్లూరి అంజనేయులు పాల్గొన్నారు.

మిల్లర్ల అసోసియేషన్ కమిటీ రాజీనామా

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 5: జిల్లా మిల్లర్ల అసోసియేషన్ కమిటీ శుక్రవారం రాజీనామా చేసింది. ఈ మేరకు గంప నాగేంద్ర, పస్పునూరి నాగభూషణం, మార్తా వెంకటేశం శుక్రవారం సభ్యుల సమక్షంలో తమ పదవులకు స్వచ్ఛంగా రాజీనామా చేశారు. అప్పటి వరకు పస్పునూరి నాగభూషణం, మార్తా వెంకటేశం, రామ్మోహన్, గడ్డం సోముచంద్, జీ. బాల్‌రెడ్డి, మంచికంటి భాస్కర్, జీ. అశోక్, సోమ నర్సయ్యలతో కలిపి హడక్ కమిటీని నియమించగా ఎన్నికల అధికారిగా గోరంటీ సుదర్శన్‌రెడ్డి ఎన్నుకున్నారు. కాగా, కొత్త కార్యవర్గాన్ని ఈ నెల 15 ఎన్నుకోనున్నారు.

జగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకం

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: స్వాతంత్ర్య సమరయోధుడు, సమతావాది, భారత మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకమని, ఆయన స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో బాబుజగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని స్థానిక జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ చీర శైలం, కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు కానుగు బాలరాజ్ గౌడ్, బందారపు భిక్షపతి, మున్సిపల్ ఛైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, గుట్ట మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్‌గౌడ్, బిట్టు హరీష్, నాయకులు దుంబాల వెంకట్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గుడ్ల వరలక్ష్మి, గుండు నర్సింహ్మా, యుగేందర్‌రెడ్డి, ఉపేందర్‌గౌడ్, ఎమ్మార్పీఎస్, టిఎమ్మార్పీఎస్ నాయకులు మంద శంకర్, బూడిద జాని, మున్సిపల్ కౌన్సిలర్ బూడిద సురేందర్, గుర్రం మహేందర్, పాపట్ల నరహరి, టీడీపీ కో కన్వీనర్ రేగు బాలనర్సయ్య, మండల అధ్యక్షుడు మచ్చ నర్సింహ్మాగౌడ్, చిత్తర్ల శ్రీను తదితరలు పాల్గొన్నారు.

● భువనగిరిలో జగ్జీవన్‌రాం విగ్రహానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్లు బెన్‌షాలూం, గంగాధర్ నివాళులర్పించారు. సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

● భూదాన్‌పోచంపల్లిలో బాబు జగ్జీవన్‌రాం యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పోతగల్ల దానయ్య, పెద్దల యాదయ్య, కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, నాయకులు పోతగల్ల బాబు, పెద్దల నాగేష్, చెరుకు నరేష్, కుక్క దానయ్య, యువజన సంఘం అధ్యక్షుడు కొమ్ము సంతోష్, ప్రధాన కార్యదర్శి గ్యార సందీప్, నాగేష్, నల్ల శ్యాం, సందీప్, బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మన్, పట్టణ అధ్యక్షుడు భారత భూషన్, నాయకులు చింతకింది రమేష్, పోవానం శ్రీనువాస్, డబ్బికార్ హరీష్, ప్రేమ్‌కుమార్, కుక్క భిక్షపతి, కోట రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

● బీబీనగర్ లో కాంగ్రెస్ జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యాంగౌడ్, బీబీనగర్ ఎంపీటీసీ గోళి నరేందర్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, నాయకులు పంజాల వెంకటేశ్ గౌడ్, లోకదాసు ఉప్పలయ్య, పొట్ట శరత్, బాస్కర్ రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

● వలిగొండ మండల కేంద్రంలోని తొర్రూరు రోడ్డులో జగ్జీవన్‌రాం విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, మండల ఇన్‌చార్జి దుబ్బ దానయ్య, మండల అధ్యక్షులు రాంచందర్, బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి, నాయకులు క్రిష్టఫర్, జానకి రాములు, భిక్షపతి పాల్గొన్నారు.

● మోత్కూరులో మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, బహుజన ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎర్రవెల్లి నర్సయ్య, బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, అవిశెట్టి అవిలిమల్లు, బోళ్ల హన్మంతు, బాలెంల మధు, మెంట నగేష్, మందుల సురేష్ పాల్గొన్నారు.

● అడ్డగూడూరులో నాయకులు బాలెంల బాబు మహాజన్, బుర్రు అనిల్, మాదాని అంతోని, గూడేపు నరేష్, బాలెంల అరవింద్, శాంతి కూమార్, అబ్బుల్, కిరాణ్, సతీష్, యాదగిరి, బాబు ఉన్నారు.

● మోటకొండూర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సురపంగ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భైరపాక నాగరాజు, మండల అధ్యక్షుడు వంగపల్లి చిరంజీవి, వంగసల్లి మహేందర్, వంగాల మల్లేష్‌గౌడ్, బొట్ల శ్రీనివాస్, బొలగాని గణేష్, భువనగిరి నర్సింగరావు పాల్గొన్నారు.

● చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లిలో, రాజీవ్ భవన్, అంబేడ్కర్ భవన్‌లలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు బాల్యం వెంకటాచలం, తాడూరు పరమేష్, జల్లా రమేష్, నాగరాజు, ఎం.నర్సింహ, జక్కర్తి శేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం)లో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలరాజు, కానుగంటి శ్రీశైలం, రాచమల్ల దుర్గయ్య, జ్ఞానేశ్వర్, చంద్రాచారి, వీరస్వామి, మల్లేశం, ఎండి.శానూర్, బుచ్చయ్య పాల్గొన్నారు.

● బొమ్మలరామారంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

● రామన్నపేట ఎంపీడీవో కార్యలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఏడుకొండలు, ఏపీఎస్ఓ పున్న వెంకటేష్, టీఏలు ప్రవీణ్, హరికృష్ణ, మధు, సుచరిత పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య



భువనగిరిలో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు బెన్‌షాలూం, గంగాధర్



ఆత్మకూరు(ఎం)లో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు



వలిగొండలో నివాళులర్పిస్తున్న నాయకులు